ప్రభాత
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 17 సెప్టెంబర్ 2025



కలెక్టర్ ల సదస్సులో పాల్గొన్న మంత్రి మండిపల్లి

## పించ ప్రాజెక్ట్ పరివాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండండి

**సుండుపల్లె, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :**



నది పరివాహక ప్రాంతంలోకి వెళ్ళరాదని ప్రమాద హెచ్చరిక బోర్డులను ఎస్ఐ శ్రీనివాసులు ఏర్పాటు చేయించారు. మంగళవారం రాయవరం నుండి రెడ్డివారి పల్లెకు వెళ్లేందుకు ఏర్పాటు చేసుకున్న మట్టి రోడ్డు పించా ప్రాజెక్టు నుండి నదిలోకి నీటిని విడుదల చేయడంతో కొట్టుకుపోయింది దీంతో తాహసిల్దార్ మెహబూబ్ చాంద్, ఎస్ఐ శ్రీనివాసులు, పరిశీలించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ నదీ పరివాహక ప్రాంతంలో ప్రజలు నదిని దాటే ప్రాంతాల వద్ద పోలీసులను బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చిన్నారులు, చేపల వేటకు వెళ్లేవాళ్లు, పశువుల కాపర్లు, ప్రజలు అదీ తీరంలోకి వెళ్ళకూడదని హెచ్చరికలు జారీ చేశారు. హెచ్చరికలు కాదని ఎవరైనా చేపల వేటకు వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ వినీత్ కుమార్ రెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్ర నాయక్, సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఏం జరుగుతోంది....?

- డ్వాక్రా సంఘాల నుంచి రూ.10లక్షలు మాయం
- బ్యాంక్ అధికారుల ఒత్తిడితో గ్రూపు సభ్యుల అయోమయం
- అధికారులకు తెలిసినా ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవు
- పోలీసులను ఆశ్రయించిన గ్రూపు సంఘ సభ్యులు





**బద్వేలు ,సెప్టెంబర్16, ప్రభాతవార్త:**

బద్వేలు మెప్మాలో అనేక అవకతవకలు జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవరిస్తుండడం వలన అవినీతి బట్టబయలవుతోంది. సంఘాలలో ఉండే సభ్యులకు పూర్తిగా అవగాహన లేకపోవడం వలన మెప్మాలోని రీసోర్స్ పర్సన్‌ల ద్వారానే సంఘాలు నడిపిస్తుంటారు. బ్యాంక్‌లో లోన్లు తీసుకోవాలన్నా, కట్టాలన్నా ఆర్‌పీ పాత్ర లేనిదే ఏమి జరగదు. సంఘాలు సమావేశాలు అయినపుడు డబ్బంతా జమకట్టి హెచ్చుతగ్గులు చూసుకుంటూ బ్యాంక్‌కు చెల్లించడం జరుగుతుంటుంది. అయితే పట్టణంలోని గౌరిశంకర్‌నగర్‌లో డ్వాక్రా గ్రూపు సభ్యులను ఆ ప్రాంత ఆర్‌పీ రూ.10 లక్షలు మాయం చేయడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సభ్యులకు తెలియకుండా బ్యాంక్ ద్వారా నగదు తీసుకున్నట్లు తెలుస్తోంది. సభ్యుల సంతకాల ద్వారా నగదు తీసుకున్నారా లేక ఫోర్జరీ సంతకాల ద్వారా నగదు తీసుకున్నారా అనేది తెలియదు గాని గ్రూపుల పేరుమీదే డబ్బులు తీసుకున్నట్లు తెలుస్తోంది. గ్రూపు సభ్యులకు పూర్తిగా తెలియకపోవడంతో బ్యాంక్‌కు వెళ్లాక తీసుకున్నది రూ.15లక్షలు అయితే రూ.20లక్షలు చెల్లించాలని బ్యాంక్ అధికారులు చెప్పడంతో అవాక్కయారు. గౌరిశంకర్ నగర్‌లోని సరస్వతి గ్రూపునకు చెందిన వారి నుంచి అధనంగా రూ.5లక్షలు ఆర్‌పీ డ్రా చేసిందని గ్రూపు సభ్యులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం గత కొద్ది నెలలుగా జరుగుతున్నా కూడా మెప్మా అధికారులు, మున్సిపల్ అధికారులు గాని ఏలాంటి చర్యలు తీసుకోలేదు. అలాగే ఆర్‌పీ పరిధిలోని అన్ని గ్రూపుల వద్ద ఇదే వ్యవహారం జరిగిందని, బయటకు మాత్రమే 10 లక్షలు కనపడుతున్నా లోలోపల ఎన్నిలక్షలు జరిగిందో తెలియదని అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపితే నిజాలు నిగ్గుతేలుతాయని కొంతమంది గ్రూపుసభ్యులు అంటున్నారు. అంతేకాకుండా బద్వేలు మెప్మా అధికారులకు ఈ వ్యవహారం తెలుసని కొంతమంది వెనకుండి నడిపించడమేకాకుండా ఈ సంఘటనను తొక్కి పెడుతున్నారని గ్రూపుసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఆర్‌పీపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా గ్రూపు సభ్యులకు డబ్బులు రికవరి చేయించడంలో కూడా మెప్మా అధికారులు ప్రయత్నించలేదని సమాచారం. అయితే బ్యాంక్ అధికారుల వద్ద ఎలాంటి ఆధారాలు కూడా ఉన్నాయో వారు కూడా గ్రూపు సభ్యులను టార్గెట్ చేసి ఖచ్చితంగా డబ్బులు చెల్లించాలని మీ లావాదేవీలు బయట చూసుకోవాలని అంటున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి సంఘటనలు బద్వేలు మెప్మాలో అక్కడక్కడా జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. గ్రూపు సభ్యులు చెప్పుకోలేక సంఘటనను బయట పెట్టలేక నలిగిపోతు అప్పుడపుడు ఇలా పోలీసుస్టేషన్‌కు వెళితే వారు కూడా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రూపుల్లో ఇంత వ్యవహారం జరుగుతుంటే అధికారులు సమావేశాలు పెట్టినపుడు ఎందుకు బయటకు తెలియనీకుండా దాచిపెడుతున్నారని దీనిపైన ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే గ్రూపు సభ్యులు ఇబ్బందులకు గురికావడమే కాకుండా డబ్బులు ఏవిధంగా బ్యాంక్‌కు చెల్లించాలని దీనిపైన అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని గ్రూపుసభ్యులు కోరుతున్నారు.

## చెయ్యేరు నదిలో వరద ప్రవాహం

జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిక



బాలరాజుపల్లె హై లెవెల్ వంతెన వద్ద వరద ప్రవాహం

**రాజంపేట, సెప్టెంబర్16 ప్రభాతవార్త**

ఎగువ ప్రాంతాల్లో పడిన వర్షాలతో పించా ప్రాజెక్టు నిండింది. దీంతో అధికారులు ప్రాజెక్టు నుంచి 630 క్యూసెక్కుల వరద నీటిని చెయ్యేరు నదిలోకి వదిలారు. మంగళవారం మధ్యాహ్నాం నాటికి బాలరాజు పెల్లికి వరద నీరు చేరింది. దీంతో రాజంపేట, నందలూరుమండలాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరద ప్రవాహం చూసి దిగాలని రాజంపేట ,నందలూరు తాసిల్దార్లు హెచ్చరించారు. గత నెలలో ఇదే విధంగా పించా ప్రాజెక్ట్ నుంచి నీరు వదిలినప్పుడు షికారుగా ఈతకు వెళ్లి బాలరాజు పల్లె వద్ద ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసిందే. చాలా చోట్ల ఉచిత ఇసుక కావడంతో ఎక్కడపడితే అక్కడ పెద్ద ఎత్తున ఇసుకలు తరలించి ఉన్నారు. దీంతో నదిలో గుంతలు ఏర్పడ్డాయి. దీని వల్ల నదిలోకి దిగినప్పుడు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## పిఆర్‌సి కమిటీ ఏర్పాటు, ఐఆర్ మంజూరు చేయాలి




ప్రభుత్వ ఉపాధ్యాయ బృందంతో ఎస్.టి.యు నాయకులు

**పులివెందుల,సెప్టెంబరు 16, ప్రభాత వార్త:**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, పెన్షనర్లకు జూలై 2023 నుండి అమలు కావలసిన 12వ పిఆర్సి ఇప్పటికే 26 నెలలు ఆలస్యమైందని, అధికారంలోకి వచ్చిన వెంటనే పిఆర్సి అమలు చేస్తామన్న ప్రభుత్వం స్పందించడం లేదని రాష్ట్రోపాధ్యాయ సంఘం. ఆం.ప్ర (ఎస్.టి.యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ రెడ్డి ఆరోపించారు. పులివెందుల మండలం లో మంగళవారం పలు పాఠశా లలను సందర్శించిన సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఉద్యోగ, పెన్షనర్లకు 2024 జనవరి నుండి ఇప్పటివరకు నాలుగు డీఏలు బకాయి పడిందని, ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అయినప్పటికీ ఒక్క డిఏ కూడా మంజూరు చేయకుండా మొండి చేయి చూపిస్తున్నద న్నారు. ఆర్థిక బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని కూడా నిలబెట్టుకోవడం లేదన్నారు.ఏ ప్రభుత్వం అయినా అధికారంలోకి రాకముందు సిపిఎస్ ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మొండి చేయి చూపిస్తున్నారన్నారు. 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుపై ఆర్థిక శాఖ ఉత్తర్వులు ఇవ్వకుండా మీనమేషాలులెక్కిస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 12వ పిఆర్సి కమిటీ ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలని, ఆర్థిక బకాయిల చెల్లింపుకై రోడ్ మ్యాప్ ప్రకటించాలని, సిపిఎస్ రద్దు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుపై నిర్ణయం ప్రకటించాలని, ఆర్థికపరమైన, విద్యారంగ పరమైన సమస్యల సాధన కోసం అక్టోబర్ 7న విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు శ్రీ బి సుధాకర్ రెడ్డి రాష్ట్ర కౌన్సిలర్లు ఏవి సుధాకర్ రెడ్డి, అంగడి నాగేంద్ర, రీజినల్ కన్వీనర్ జి మల్లేష్, సీనియర్ నాయకులు ఎస్.శంకర్ నాయక్, మండల బాధ్యులు శ్రీధర్ రావు, శ్యామ్ కుమార్ రెడ్డి, పి అలీబాబా సోమ సుబ్బిరెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# యువ ఐఏఎస్‌ల సేవల్ని వాడుకుంటాం

**కడప, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**

వివిధ ప్రభుత్వ శాఖలు అందించే సేవలకు ఇకపై రేటింగ్స్ ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. క్వాంటం వ్యాలీ, వాట్సప్ గవర్నెన్స్, డేటా లేక్, ఆర్టీజీఎస్ లెన్స్, అవేర్ 2.0 అంశాలపై సీఎం సమీక్షి ంచారు. పాలనలో టెక్నాలజీ వినియోగంపై జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..”కొన్ని ప్రభుత్వ శాఖల పనితీరు మరింతగా మెరుగు పడాల్సి అవసరం ఉంది. గతంతో పోల్చుకుంటే కొన్ని శాఖల పనితీరు మెరుగు అయినా... రెవెన్యూ లాంటి శాఖల పనితీరు మరింత బాగుపడాల్సి ఉంది. ఎన్ని సార్లు చెబుతున్నా రెవెన్యూ శాఖ ప్రజలకు సంతృప్త స్థాయిలో సేవలు అందించటం లేదు. ఈ పరిస్థితుల్లో అన్ని ప్రభుత్వ సేవల్ని రేటింగ్ చేయాలని నిర్ణయించాం. కలెక్టర్లు చూసే దస్త్రాల క్వాలిటీ ఎంత ఉందో కూడా తనిఖీ చేస్తాం. సీనియర్ అధికారులు కూడా తమ పని విధానం మార్చుకోవాలి. ఇకపై తమ తమ శాఖలకు సంబంధించిన క్షేత్ర స్థాయి సమాచారం కోసం పదే పదే కలెక్టర్లను నివేదికలు అడిగే పరిస్థితి రాకూడదు. ఆర్టీజీఎస్ నుంచి అవసర మైన మేరకు నివేదికలు తీసుకోవాలి. దానికి అనుగుణంగా క్షేత్ర స్థాయిలో పని చేయించాలి. ఉన్నతా ధికారులు కలెక్టర్లను రిపోర్టులు కోరుతూ ఉండడం వల్ల పనులు ముందుకు కదలడం లేదనే విమర్శలు వస్తున్నాయని... ఇకపై ఇలాంటి వాటికి చెక్ పెట్టాలి. ఆ కాలం ముగిసింది.” అని చంద్రబాబు స్పష్టం చేశారు.ఫైళ్లన్ని ఆన్ లైన్ చేయాల్సిందేరెండు నెలల్లో 100 శాతం అన్ని ఫైళ్లు ఆన్ లైన్ లో ఉండాల్సిందే. మానుప్యులేషన్ లేకుండా ఫోరెన్సిక్ ఆడిటింగ్ లాంటివి కూడా తీసుకువస్తాం. నెక్స్ట్ జెన్ టెక్నాలజీ వైపు మనం ముందడుగు వేయాలి. ఆర్టీజీఎస్ ద్వారా అవేర్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. దీని ద్వారా 42 రకాల సమాచారం కలెక్టర్లకు అందుతోంది. నవంబరు నెలలోగా డేటా లేక్ పూర్తిగా అందరికీ అందుబాటులోకి వస్తుంది. వచ్చే కలెక్టర్ల సదస్సు నాటికి ఏయే జిల్లాలు ఎక్కడెక్కడ తమ పనితీరు మెరుగుపరుచుకోవాలో కూడా రియల్ టైమ్ లో చెప్పేలా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నాం. లాస్ట్ మైల్ వరకూ ప్రయోజనాలు అం దేలా టెక్నాలజీ వినియోగించాలి. వచ్చే రెండేళ్లలో ఈ ఫలితాలను కూడా అందుకోవచ్చు. ఆర్టీజీ జిల్లా కేంద్రాలు నవంబర్ నాటికి సిద్ధం అవుతాయి. టెక్నాలజీ వినియోగంపై అక్టోబరు నెలలో మంత్రులు, అధికారులు, కలెక్టర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తాం.” అని సీఎం వెల్లడించారు.టెక్నాలజీ ఎకో సిస్టం తెస్తాం “ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కానీ... ఇతర అత్యవసర సమయాల్లో ప్రజలను అలెర్ట్ చేసేలా అలెర్ట్ బ్రాడ్ కాస్ట్ సిస్టం ఏర్పాటు చేయాలి. దీన్ని వివిధ ప్రాంతాల్లో చేపట్టాలి. అలాగే సీసీ టీవీ ఫుటేజీలను అనాలసిస్ చేసే పరిస్థితి తీసుకురావావి. బ్యాండ్ విడ్త్ లేని సమయం నుంచి అత్యధిక బ్యాండ్ విడ్త్ తో పనిచేసే సమయం వచ్చింది. చురుగ్గా ఉండే యువ అఖిల భారత సర్వీసు అధికారుల సేవల్ని వినియోగించుకుంటాం. ఏపీలో టెక్నాలజీ ఎకో సిస్టం క్రియేట్ చేసేందుకు ఐదుగురు యువ అధికారులను నియమించాం. టెక్నాలజీ రంగంతోపాటు... ఇన్నోవేషన్ వంటి రంగాల్లో కూడా యువ ఐఏఎస్సులకు బాధ్యత అప్పజెప్పాం. ఇటీవల కాలంలో నేను చాలా మంది ఐఏఎస్సులతో మాట్లాడాను. కొందరు యువ ఐఏఎస్సుల్లో చాలా ఆలోచనలు ఉన్నాయి. చాలా వినూత్నంగా ఆలోచిస్తున్నారు. అ లాంటి వాళ్లను పికప్ చేస్తున్నాం.” అని చంద్రబాబు చెప్పారు.క్వాంటం భవనాల డిజైన్లుకలెక్టర్ల కాన్ఫరె న్సులో క్వాంటం వ్యాలీ భవనాల డిజైన్లను ప్రదర్శించారు. ఆ భవనాలపై కలెక్టర్ల అభిప్రాయాలను సీఎం కోరారు. భవిష్యత్తులో 3 వేల క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ల ఏర్పాటుకు వీలుగా కార్యాలయ స్థలం అందుబాటులోకి రానున్నట్టు చంద్రబాబు వెల్లడించారు. 80 వేలమంది పని చేసేలా క్వాంటం వ్యాలీ భవ నాల నిర్మాణం చేపడుతున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు.




## ఓజోన్ రక్షణతోనే మానవాళికి భద్రత.




ఓజోన్ అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు.

**చిట్వేలి,సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:**

సూర్యుని నుండి వెలువడే హానికర అతినీలలోహిత కిరణాలనుంచి రక్షించే ఓజోన్ పొరను సంరక్షించడం వల్లే మానవాళికి భద్రత చేకూరుతుందని ఉన్నత పాఠశాల హెచ్ఎం దుర్గరాజు అన్నారు. మంగళవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.దుర్గరాజు మాట్లాడుతూ ఓజోన్ క్షీణతకు మానవాళి చేపట్టే చర్యలే పరోక్షంగా కారణమన్నారు. ఓజోన్ పొర క్షీణించడం వల్ల పలు రకాల చర్మ వ్యాధులు, కంటి సమస్యలు ఏర్పడతాయన్నారు. జీవ శాస్త్ర ఉపాధ్యాయులు శివ నారాయణ మాట్లాడుతూ ఓజోన్ సంరక్షణకు కాలుష్యకారకాలను తగ్గించడం, విరివిగా చెట్లను నాటడం, క్లోరో క్లోరో కార్బన్ల వినియోగాన్ని తగ్గించాలన్నారు.ఓజోన్ క్షీణత వల్ల కలిగే ఇబ్బందులను, సంరక్షణకు చేపట్టవలసిన చర్యలను గూర్చి ప్లకార్డులతో నినాదాలు చేస్తూ విద్యార్థులు నూతన బస్టాండ్ ప్రాంగణంలో మానవహారంగా ఏర్పడి ప్రజలకు అవగాహన కల్పించారు. ఓజోన్ ప్రాముఖ్యత గురించి పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.ఉపాధ్యాయులు కళావతి, సుహాసిని మరియు సునీత కుమారి మాట్లాడుతూ మన జీవ ప్రపంచ వారసత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందించాలంటే ప్రకృతి సంరక్షణ ముఖ్యమని, ఖిబతుకుబతకనివ్వుఖి అనే విధానాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రకృతి సంరక్షణ అన్ని దేశాల బాధ్యతగా గ్రహించాలని అన్నారు. కార్యక్రమంలో సహా ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, లక్ష్మీ కళావతి, సుహాసిని, సోఫియా, గీతా రాణి, శ్రీకాంతి ,నాగమణి, పెంచల్ దాసు, చిన్న బాబు,రఫీ పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈగల్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో.. కార్యక్రమం

**కడప క్రైం, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:**

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు నగరంలోని చిన్నచౌకు పీఎస్ పరిధిలో గల జీఎంఆర్ ఈఎం స్కూలు నందు నార్కోటిక్ సెల్ మరియు ఈగల్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మత్తు పదార్థాల వాడకంతో కలిగే శారీరక, మానసిక సమస్యలను వివరించి వాటిని కలిగిన, రవాణా చేసిన కొనిన లేదా విక్రయించిన వారికి చట్టంలో విధించే శిక్షలను వివరిస్తూ, విద్యార్థుకు మంచి భవిష్యత్తు ఉందని వారు చదువు పట్ల శ్రద్ధ చూపి మంచి ఉన్నత ఉద్యోగాఉ సాధించాలని సూచించారు. నేటి విద్యార్థులు రేపటి భావి భారత పౌరులని, దేశానికి పట్టుకొమ్మలని దేశ భవిష్యత్తు నేటి పిల్లలపైనే ఉన్నదని కావునా పిల్లలు ఎవరూ కూడా మత్తు పదార్థాల బారిన పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవచ్చని సూచించారు. ఈగల్ క్లబ్స్ ప్రతి స్కూలు నందు ఏర్పాటు చేయాలని తెలిపి ఈగల్ క్లబ్ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని 1972 టోల్ ఫ్రీ నెంబరు అలాగే 8977781972 వాట్సాప్ నెంబరుకు తెలియజేయాలని సమాచారం తెలిపిన వారి యొక్క వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఛైర్మన్ మరియు ప్రిన్సిపల్ మధుసూదన్‌రెడ్డి, చిన్నచౌకు ఏఎస్ఐ యోగేంద్ర రాయల్, నార్కోటిక్ సెల్ ఏఎస్ఐ మల్లయ్య, ఈగల్ బృందం సభ్యులు అయుఖాన్, గురుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రజల భద్రతకు విజిబుల్ పోలీసింగ్

**కడప క్రైం, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:**

జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పోలీసులు విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు ప్రజలకు మరింత చేరువవుతూ నేరాలను నియంత్రించడం, రహదారి భద్రతపై అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నారు. అనుమానాస్పద వాహనాలను క్షుణంగా తనిఖీ చేస్తున్నారు. ముఖ్యంగా నిషేధిత వస్తువులు, గంజాయి వంటి వాటి అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు సైబర్ నేరాల భారిన పడకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ పంచుకోవద్దని సూచించారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నారు.

## ట్రాన్స్ ఫారంలో కాపర్ వైర్ చోరీ

**దువ్వూరు సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దువ్వూరుకు సమీపంలోని పొలాల్లో 3 చోట్ల రైతులకు సంబంధించి విద్యుత్ ట్రాన్స్ఫరాలలో కాపర్ వైర్ చోరీకి గురైనట్లు ఏఈ రాజకుమార్ తెలిపారు. దువ్వూరుకు సమీపంలోని పట్టాభిరామయ్య, బుచ్చయ్య, సంజీవ రాయుడు పొలాల వద్ద ఉన్న వ్యవసాయానికి సంబంధించిన ట్రాన్స్ ఫారాలలో గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి అందులోని కాపరు వైర్ ను తీసుకువెళ్లారని అలాగే ఈ ఆయిల్ ను అక్కడే పడ వేసినట్టు తెలిపారు. వీటి విలువ సుమారు 12 వేల రూపాయలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

## ట్రాక్టర్ టైర్ కింద పడి వ్యక్తికి గాయాలు....

**ముద్దనూరు.సెప్టెంబర్ 16. ప్రభాతవార్త:**

మండల పరిధిలోని మాదన్న గారి పల్లె గ్రామ సమీపంలో మంగళవారం నాడు ట్రాక్టర్ అదుపు తప్పి డ్రైవర్ టైర్ కింద పడి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు వివరాల మేరకు చాపాడు మండలం అన్నవరం గ్రామానికి చెందిన గంగయ్య ట్రాక్టర్ లో పశువుల ఎరువు తీసుకొని మండలంలోని సోంపల్లి గ్రామంలోని ఓ రైతు పొలంలో దింపి తిరుగు ప్రయాణంలో ఈ ఘటన చోటు చేసుకోవడంతో 108 సమాచారం ఇవ్వగా హుటాహుటిన సిబ్బందికి ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని ప్రొద్దుటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఈఎంటి శ్రీనివాసులు, పైలెట్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

## దొంగ నోట్ల మార్పిడి కేసులో 5 మందికి జైలు శిక్ష

**సిద్ధవటం సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**

సిద్ధవటం పి.ఎస్ పరిధిలో 2010 సం. లో జరిగిన దొంగ నోట్ల మార్పిడి కేసులో 5 మంది ముద్దాయిలకు 7 సంత్సరాల సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 5,000/ జరిమానా విధిస్తూ బద్వేల్ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి పద్మశ్రీ కోర్ట్ తీర్పు ఇచ్చారు. కేసు వివరాలు: సిద్ధవటం పి.ఎస్.Cr.No. 115/10 U/s 420, 489(B) !! (C) IPC. శిక్ష పడ్డ ఖైదిలు ఉమ్మడి మాధవరెడ్డి అనపతి షఫీద్దీన్, తెలుగు వెంకటేశ్వర్లు, షేక్ అల్తాఫ్ హుస్సేన్,షేక్ హుస్సేన్ వలిలు.

## వాహనమిత్రకు ధరఖాస్తు చేసుకోండి

**కురబలకోట, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త :**

వాహనమిత్రకు ధరఖాస్తులు చేసుకోవాలని కురబలకోట ఎంపిడిఓ గంగయ్య తెలిపారు. వాహనమిత్ర పథకానికి ఆటో, మోటార్‌క్యాబ్, మ్యాక్సీక్యాబ్ డ్రైవర్లు ధరఖాస్తు చేసుకోవాలని ఆయన చెప్పారు. ఈనెల 19లోపు వాహనపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు గ్రామ సచివాలయాల్లో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. 22న ధరఖాస్తు చేసుకొన్న వారి పీల్డ్ వెరిఫికేషన్ పూర్తిచేసి 25లోపు తుదిజాబితాను ఎంపిక చేస్తామని, అర్హుత కలిగిన వారికి అక్టోబర్ 1న ఆర్థికసాయం అందజేస్తుందని తెలిపారు.

## ఆడబిడ్డల ఆరోగ్యమే లక్ష్యం

బద్వేలు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తొట్టిగారిపల్లిలో ప్రధానమంత్రి మోడీ పుట్టిన రోజు సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేశారని, ఈ శిబిరాల్లో మహిళ ఆరోగ్యము రక్తహీనత లేకుండా తల్లి శిశువు సంరక్షణ పోషకాహారము మరియు కుటుంబ ఆరోగ్య నిర్ణయాలు మహిళ యొక్క నాయకత్వం ఆశా వర్కర్లు మరియు మహిళా సంఘాలు చైతన్యమును గురించి అవగాహన సదస్సులు మరియు నిపుణులైన డాక్టర్ల స్త్రీవ్యాధి నిపుణులు, జనరల్ ఫిజీషియన్ ద్వారా చిన్నపిల్లల డాక్టర్ల ద్వారా కంటి పరీక్షలు, దంత సంరక్షణ మొదలగు నిపుణులైన డాక్టర్ల ద్వారా వైద్య సేవలు అందించబడునని, రక్తపోటుకు షుగర్ వ్యాధిగ్రస్తులకు మరియు టీబీ పరీక్షలు మొదలగు అన్నీ కూడా చూసి వైద్య సేవలు మందులు పంపిణీ చేయబడును. కావున ఈ యొక్క సదవకాశము మండలం ప్రజలందరూ వినియోగించుకోవాలని ఓ ప్రకటనలో తెలిపారు.

## బందోబస్తు మధ్య మండల మీట్


తంబళ్లపల్లె సెప్టెంబర్ 16 ప్రభాతవార్త ః



గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసు పహారాలో మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. ఉదయం ఎంపీపీ అనసూయ ఆధ్వర్యంలో సమావేశం ప్రారంభంగా కాగా తాసిల్దార్ శ్రీనివాసులు భూముల రిసర్వేలో జరిగిన పొరపాట్లను సరి దిద్దడంతో పాటు త్వరలో జరిగే ఆరు రెవెన్యూ గ్రామాల రీసర్వే పారదర్శకంగా నిర్వహిస్తామని, రేషన్ కార్డుల మార్పులు చేర్పులు, నూతన కార్డుల పంపిణీపై వివరించారు. ఎంఈఓ త్యాగరాజు మండలస్థాయి క్రీడా పోటీలు, ఉపాధ్యాయుల భర్తీ, విద్యాభివృద్ధిపై వివరణ ఇచ్చారు. వివిధ శాఖల అధికారులు సమస్యలపై చర్చించారు. అనంతరం సమావేశానికి హాజరు కాని అధికారులకు ఎంపిడిఓ షోకాజ్ నోటీసులు పంపిస్తామన్నారు. కొందరు సభ్యులు లేవనెత్తిన సమస్యలను చాకచక్యంగా పరిష్కరించారు. మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ మండల మీట్లో వైస్ ప్రెసిడెంట్ శ్యామలమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు, టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, బీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తులసీదర్ నాయుడు, పురుషోత్తం, బేరి శ్రీనివాసులు, ఉత్తమ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## ఆక్రమణలు చేస్తే చర్యలు తప్పవు

పెనగలూరు సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



మండలంలో వెలగచర్ల కొండూరు దామన్న చర్ల గ్రామాల్లో ఉన్నటువంటి ప్రభుత్వ భూముల వచ్చిన వార్తలపై మండల తాసిల్దార్ అమరేశ్వరి స్పందించారు ఆమె మాట్లాడుతూ కబ్జా గురైన భూములను సమగ్ర విచారణ జరిపించి తగు చర్యలు తీసుకుంటాము అలాగే మండలంలో ఉన్నటువంటి ప్రభుత్వ భూములను ఆక్రమించిన మరియు కబ్జాకు పాల్పడిన వారి పైన కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా తెలిపారు.

## నేడు జిల్లా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం

మదనపల్లె క్రైమ్ సెప్టెంబర్ 16 ప్రభాతవార్త.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా రక్తదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సేవా పక్వాడ్ జిల్లా కన్వీనర్, బిజెపి అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి ప్రశాంత్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా దేశవ్యాప్తంగా సేవ పక్షోత్స వాల నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా మదనపల్లిలో 17వ తేదీ రక్త దానం, 18వ తేదీ స్వచ్ఛభారత్, 19వ తేదీ తల్లికి వందనం పేరుతో మొక్కలు పెంపకం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బుధవారం జరిగే లక్కదాన శిబిరానికి బిజెపి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో కోసూరి భవాని పిల్ల స్వామి నాయక్, కిరణ్, సుబ్బారెడ్డి, నరేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యూరియా వాడకంపై అవగాహన


ముద్దనూరు. సెప్టెంబర్16. ప్రభాతవార్త:



మండలంలోని యామవరం మరియు చింత కుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతూ ఖరీఫ్లో సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా పంట నమోదు చేయించాలన్నారు. అలాగే రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని కోరారు. యూరియా అతిగా వాడకం వల్ల భూమి కూడా కాలుష్యం అయిపోతుంది.అలాగే దిగుబడులు పైన కూడా నష్ట ప్రభావం చూపుతుంది ప్రతి పంటకు యూరియా ను శాస్త్రవేత్తలు సూచించిన పరిమాణం మేరకే వాడుకోవాలి రైతులకు తెలిపారు జిప్సం అందుబాటులో ఉంది కావలసిన రైతులు తిమ్మాపురం, ముద్దనూరు రైతు సేవా కేంద్రాల్లో ఉన్న సిబ్బందిని సంప్రదించాలి వరి పంట సాగు చేసే రైతులు నారును కొనలు తుంచి నాటుకున్నట్లైయితే పురుగు ఉధృతి నుండి కాపాడుకోవచ్చును కాలి బాటలు తీసుకుంటే గాలి వెలుతురు బాగా తగిలి దుబ్బు బాగా చేస్తుంది చీడ పీడల బారి నుండి పంటను రక్షించుకోవచ్చును తదుపరి గ్రామంలో సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించి దిగుబడులు గురించి అడిగి తెలుసుకున్నారు రైతులు ఎరువులు,విత్తనాలు,పురుగు మందులు కొన్నప్పుడు తప్పనిసరిగా నగదు బిల్లు తీసుకోవాలి తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ విఏఏ సి.సుధాకర్,మరియు గ్రామ రైతులు ,గ్రామ నౌకర్లు పాల్గొన్నారు.

## బీసీ కార్పొరేషన్ రుణాలను మంజూరు చేయ్యాలి

ఎడ్యుకేషన్ సెప్టెంబర్ 16 ప్రభాతవార్త :



బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలను విడుదల చెయ్యాలని కోరుతూ ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి, యువజన సంఘం (పిఆర్ఎస్ వైఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం నాడు బీసీ కార్పొరేషన్ కార్యాలయం నందు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడి) ఎస్.జయసింహా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిఆర్ఎస్వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ మాట్లాడుతూ.2025-2026 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకింగ్ సబ్సిడీ రుణాలను విడుదల చేయాలని, ఈ రుణాలకు 2025 జనవరి 3 తేదీన నోటిఫికేషన్ విడుదల చేసి జిల్లాకు 2200 యూనిట్లను కేటాయించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ప్రకటనకు మాత్రమే పరిమితమయ్యాయి, సబ్సిడీ రుణాలు మంజూరును గాలికి వదిలేసిందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అర్హులైన లబ్ధిదారులకు సబ్సిడీ విడుదల చేసి, న్యాయం చెయ్యాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు,జిల్లా నాయకులు వేణు పాల్గొన్నారు.

## పైపులైను లీకేజీని అరికట్టండి

సిద్దవటం సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



సిద్దవటం మండలం మాధవరం1 గ్రామ పంచాయతీ రోడ్ నెంబర్ 13లో దాదాపు 15రోజులుగా వీధి కొళాయి ఇనుప పైపు లైను లీకేజ్ అవుతుంది. సర్పంచ్ ఇంటికి కూతవేటు దూరంలో వున్న ఈ లీకేజ్ గురించి పలుమార్లు పంచాయతీ సెక్రెటరీ, సర్పంచ్ దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోలేదు ఇదుగో అదిగో చేస్తాం అంటున్నారు తప్ప రిపేరు చేపించడం లేదు. ఈ పైపు లైన్ డ్యామేజ్ వలన నీరు నిల్వ చేరి అవే నీరు మరలా ఇళ్ళలోకి వస్తున్నాయి అంతేకాకుండా నిల్వ నీటిలో చుట్టు ప్రక్కల వారు చెత్తను కూడా వేయడంతో దోమలు ఎక్కువయ్యాయని దానివలన పిల్లలకు, వృద్ధులకు విష జ్వరాలు సోకుతున్నాయని స్దానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దయచేసి ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని లీకేజీని అరికట్టి మరమ్మత్తులు చేయించాలని పరిసర ప్రజలు కోరుతున్నారు.

## మండల స్థాయి క్రీడా పోటీలకు శ్రీకారం



తంబళ్లపల్లె సెప్టెంబర్ 16 ప్రభాతవార్త ః

మండలంలోని మోడల్ స్కూల్లో మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీలకు ప్రిన్సిపల్ హేమంత్ కుమార్ శ్రీకారం చుట్టారు. ఉదయం 14 ఏళ్ల లోపు మరియు 17 ఏళ్ల లోపు బాల బాలికలకు రన్నింగ్ రేస్ 200 మీటర్లు, 400 మీటర్లు, 600 మీటర్లు, లాంగ్ జంప్, షార్ట్ పుట్, డిస్క్ త్రో, హైజంప్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్లు శివకుమార్, వాణిశ్రీ, టిడిపి తెలుగు యువత నాయకుడు నరసింహులు, మండలంలోని పాఠశాలల హెడ్మాస్టర్లు, పీడీలు ఖాదర్ బాషా, మహేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ లత, ఖాజావుద్దీన్, రాజీవ్, హంస వేణి, క్రీడాకారులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో క్యాంపస్ సెలెక్షన్స్.



ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:

స్థానిక వైయస్సార్ కళాశాల ప్రాంగణంలో క్యూ స్పైడర్స్ అనే కంపెనీ ప్రతినిధులు ఐశ్వర్య, అరుణిమ పాండా ఆధ్వర్యంలో క్యాంపస్ నియామకాలు చేపట్టారు. నాల్గవ సంవత్సరం ఇంజనీరింగ్ చదువుకున్న విద్యార్థిని విద్యార్థులకు సమూహ చర్చ మరియు వ్రాత పరీక్ష ఆధారముగా నియామకాలు జరిపి 32 మందిని ఎంపిక చేసుకున్నారు. ఇందులో 11మంది విద్యార్థినులు, 21మంది విద్యార్థులు ఉన్నారని కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జయరామి రెడ్డి,డీన్ ఆచార్య జయచంద్రారెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థిని విద్యార్థులు మాట్లాడుతూ మా భవిషత్ నిర్మాణానికి, ఉద్యోగ నియామకాలకు వారు ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారని మిగతా విద్యార్థులు కూడా తమ కెరీర్ పై శ్రద్ధ పెట్టి ఇలాంటి క్యాంపస్ సెలెక్షన్స్ లో విజయం సాధించాలని అలాగే ఈ కళాశాలకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమం మొత్తం ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు . ఈ సందర్భంగా టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ సిబ్బంది ఆనందం వెలిబుచ్చారు.

## ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజం

ప్రొద్దుటూరు సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



గత ఎన్నికల సమయంలో అమలు కాని హామీలు ఇచ్చి సిఎం చంద్రబాబు మరోసారి మోసం చేశారని, రాష్ట్రంలోని 14 లక్షల ఉద్యోగులకు ఇచ్చిన హామీలను సైతం అమలు చేయక మరోసారి మోసం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి విరుచుక పడ్డారు. మంగళవారం తన నివాసంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ, ఫించనర్లకు కూటమి ప్రభుత్వం అలవిగాని హామీలను ఇచ్చిందని, కానీ 16 నెలలలో కేవలం ఒక హామీ కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. అధికారంలోకి రాగానే డిఎ బకాయిలతో వివిధ రకాల బకాయిలు చెల్లిస్తామని చెప్పి ఇప్పటికి ఇవ్వలేదని, రద్దు చేస్తామన్న సిపిఎస్ ఊసే లేదన్నారు. గతంలో లాగా టెలికాన్ఫరెన్స్‌లతో ఉద్యోగుల సమయాన్ని వృధా చేయనన్న ముఖ్యమంత్రి ప్రజలకు ఉద్యోగస్థులు అందుబాటులో లేకుండా వారంలో నాలుగైదు రోజులు టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉద్యోగుల పని భారం తగ్గించేందుకు కొత్త నియామకాలు చేపడుతానన్న సీఎం ఇంతవరకు ఎలాంటి నియామకాలు చేపట్టలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాజుపాలెం మండల వైసీపీ కన్వీనర్ బాణా వెంకట కొండారెడ్డి కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి, గుర్రం లావణ్య, రాగుల శాంతి, మన్నె సత్యం, గరిశపాటి లక్ష్మి దేవి, మండల వైసీపీ అద్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, మండల వైసిపి బిసి సెల్ ఉపాధ్యక్షులు నల్లదేశి జంగమయ్య, రాష్ట్ర వైసిపి ఉద్యోగుల సంఘం కార్యవర్గ సభ్యులు రాయపురెడ్డి ఎస్టీ సెల్ నాయకులు వనం చిన్న గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## చౌక దుకాణ డీలర్లకు కొత్త ఈపాస్ డివైజర్ల పంపిణీ

పీలేరు సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:



కొత్త ఈ పాస్ యంత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ చౌక దుకాణ డీలర్లకు కొత్త ఈపాస్ డివైజర్ల పంపిణీ చేసినట్లు ఈ పాస్ డివైసెస్ జిల్లా సమన్వయకర్త భయ్యారెడ్డి తెలిపారు. మంగళవారం పీలేరు ఎంపీడీవో కార్యాలయం సమావేశం మందిరంలో జరిగిన డివైజర్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల పరిధిలోని చౌక దుకాణాల నిర్వాహకులు 258 మందికి విఏ 21 మోడల్ 4 జి జియో నెట్వర్క్ ఈపాస్ డివైజస్ పంపిణీ చేశామన్నారు. పీలేరు మండలానికి 56, కలికిరి మండలానికి 34, కెవి పల్లి మండలానికి 52, కలకడ మండలానికి 32, వాల్మీకి పురానికి 45, గుర్రంకొండకు 39 డివైజెస్ కేటాయింపు జరిగిందని తెలియజేశారు. పాత ఈపాస్ మిషన్లలో 2 జి నెట్వర్క్ సౌకర్యం మాత్రమే ఉండడంతో డీలర్లు నెట్వర్క్ సమస్యతో ఇబ్బందులు పడేవారని తెలిపారు. ప్రస్తుతం పంపిణీ చేస్తున్న ఈపాస్ డివైజస్ లలో 4 జి నెట్వర్క్, హాట్స్పాట్, వైఫై సౌకర్యాలతో పాటు ప్రభుత్వం కొత్తగా పంపిణీ చేయనున్న క్యూ ఆర్ కోడ్ కార్డుల స్కానింగ్, స్వైపింగ్ సిస్టంని కూడా తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్లు విజయ్ కుమార్ రెడ్డి, పజురుల్లా, రెవెన్యూ సిబ్బంది, చౌక దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

## కార్మికులకు రావలసిన జీతాలపై సర్పంచ్‌కి వినతి

పీలేరు సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:

పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్ భాషా కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యాలయంలో 121 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉండగా, ప్రస్తుతం 114 మంది పని చేస్తున్నారని. 46 మందికి రెండు నెలలుగా జీతాలు చెల్లించలేదన్నారు. సుమారు రూ. 11 లక్షలు జీతాలు చెల్లించాల్సి ఉందన్నారు. ఒక్కొక్కరికి నెలకు రూ. 12,500 చొప్పున రెండు నెలలకు వేతనాలు అందాల్సి ఉందని తెలియజేశారు. ఈ విషయంపై డీపీఓకు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. స్పందించిన సర్పంచ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్య తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ యూనియన్ నాయకులు డి. వెంకటరామయ్య. బి.వి. రమణ. ఓబులేసు, యల్లయ్య, పి. రెడ్డెప్ప, బానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్ హబీబ్ భాషా కు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

## సుఖ వ్యాధులపై ప్రజలకు అవగాహన




ఒంటిమిట్ట సెప్టెంబర్ 16( ప్రభాతవార్త)

జిల్లాస్థాయి ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది సుఖ వ్యాధులపై మండల కేంద్రమైన ఒంటిమిట్ట జిల్లా పరిషత్ పాఠశాల వద్ద, బస్టాండ్ వద్ద, శ్రీ కోదండ రామాలయం కూడలిలో, కొత్త మాధవరం జడ్పీ హైస్కూల్, బస్టాండ్ వద్ద మంగళవారం ప్రచార రథంపై ప్రజలకు సలహాలు సూచనలు ఇస్తూ అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎల్ డబ్ల్యూ ఎస్ జోనల్ సూపర్వైజర్ ఓబులయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కురవంక అభివృద్ధిపై చర్చకు సిద్దమా

గ్రామవార్డు సభ్యులు సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మదనపల్లె, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త :

రూరల్ మండలంలోని కురవంక గ్రామ పంచాయితీ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ వార్డు సభ్యులు సవాల్ విసిరారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వార్డు సభ్యులు క్రిష్ణమూర్తి, నాగరాజులు మాట్లాడుతూ గ్రామ పంచాయితీ అభివృద్ధికి సర్పంచ్ పసుపులేటి చలపతి ఎంతో కృషి చేశారన్నారు. గ్రామంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేక పసుపులేటి వినోద్‌కుమార్ విమర్శలు చేయడం భావ్యం కాదన్నారు. అభివృద్ధిపైన తాము ఎప్పుడూ చర్చకు సిద్ధమే అన్నారు. గ్రామంలో ఇప్పటి వరకు సర్పంచ్ రూ.3 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అంతేకాకుండా సొంత నిధులతో కూడా ప్రజా అవసరాల మేరకు పనులు చేశారన్నారు. రూరల్ మండలంలో ఏ గ్రామంలో జరగని విధంగా కురవంకలో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఎన్నో ఏళ్ళుగా పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారన్నారు. పంచాయితీ కార్యదర్శి పారిశుద్ధ్యకార్మికులకు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టిందన్నారు. పెండింగ్‌వేతనాలు గురించి ప్రశ్నిస్తే గ్రామంలో ఏదో జరిగిందని ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. బివైఎస్ అధ్యక్షులు పునిత్ కార్మికుల పక్షాన నిలబడి వాస్తవాలు మాట్లాడితే ఉలుకెందుకు అన్నారు. గ్రామంలో విమర్శలు మాని కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, బివైఎస్ సభ్యులు పాల్గొన్నారు.

## పేదలకు వైద్యం, విద్యను భారం చేయకూడదు

కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌కె.బాషా

మదనపల్లె, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త :



పేదలకు వైద్యం, విద్యను భారం చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్‌కె.బాషా తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పిపిపి విధానంలో ప్రజల అపోహలు తొలగించాలన్నారు. మెడికల్ కళాశాల నిర్వహణను ప్రభుత్వం ఆర్థిక అంశాలతో ముడిపెట్టడం తగదన్నారు. రాష్ట్రంలో మైనార్టీ కార్పోరేషన్ ద్వారా ముస్లింలకు రుణలు, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిల్లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల అందుబాటులోకి వస్తే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. అత్యవసర వైద్యానికి సుదూర ప్రాంతాలకు వెళ్ళాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీ ప్రకారం సమగ్ర అభివృద్ధికి అండగా నిలవాలన్నారు. పిపిపి పద్దతిలో మెడికల్ కళాశాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తొందని ప్రకటనచేయడంలో పేదలకు నాణ్యమైన వైద్యం అందని ద్రాక్షలా మారుతుందని తెలిపారు. ప్రభుత్వమే మెడికల్ కళాశాలను నిర్వహించి పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.

## కురబలకోట హైస్కూల్ విద్యార్థిని ప్రతిభ

కురబలకోట, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త :



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

మారుమూల ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థుల్లో క్రీడానైపుణ్యం వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఉద్దేశ్యంతో మండలస్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో పోటీకి తలపడాలని విద్యార్థులకు స్కూల్‌గేమ్స్ నిర్వహిస్తోంది. కురబలకోట హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న కె.షహనాజు జిల్లా ఫుట్‌బాల్ టీమ్‌కు ఎంపికైనట్లు కురబలకోట హైస్కూల్ హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. మదనపల్లెలో జరిగిన అండర్-19 ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్‌గేమ్స్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ ఎంపికల్లో కురబలకోట హైస్కూల్‌కు చెందిన షహనాజ్ జిల్లా జట్టుకు ఎంపికైంది. అండర్-19 ఫుట్‌బాల్ రాష్ట్ర స్థాయిలో శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగే రాష్ట్ర పోటీల్లో విద్యార్థి పాల్గొంటుందని ఆమె తెలిపారు. ఎంపికైన విద్యార్థినిని హెచ్‌ఎం, పీడి మహేంద్ర, స్కూల్ కమిటీ ఛైర్మెన్ కె.మహమ్మద్‌రఫి, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.

## సిటిఎం ఉన్నత పాఠశాలలో హిందీ దినోత్సవం



హిందీ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మదనపల్లె, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త :

మదనపల్లె రూరల్ మండలంలో సిటిఎం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఘనంగా హిందీ దినోత్సవం హెచ్‌ఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని హిందీ ఉపాధ్యాయులు రమేష్, మహమ్మద్‌బేగ్‌లు ప్రసంగించారు. ఈ దినోత్సవాన్ని పురష్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, కథలు, కవితలు, డ్రామాలు వంటి కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. దీనిని పురష్కరించుకొని శ్రీక్రిష్ణదేవరాయుల డ్రామా చూపరులను ఆకట్టుకొంది. ప్రతి ఒక్కరూ జాతీయబాష హిందీలో మాట్లాడే విధంగా అలవాటు చేసుకోవాలని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిధర్‌నాయక్, బాలక్రిష్ణనాయుడు, భారతి, సుజాత, సురేంద్రప్ప, ప్రమీల, క్రిష్ణానందం, గౌస్, నాగరాజు, నరేష్, పాల్గొన్నారు.

## అంగళ్ళులో పిడుగుపాటు

కురబలకోట, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త :

సోమవారం రాత్రి కురబలకోట మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అంగళ్ళు బస్టాండు సమీపంలోని ఓ కొబ్బరిచెట్టుపై పిడుగుపడింది. దీంతో స్థానిక ప్రజలు ఉలిక్కిపడ్డారు. పిడుగుపాటు వల్ల విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ దెబ్బతినింది. అందకారం నెలకొంది. ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. మంగళవారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్‌ను కొత్తది ఏర్పాటు చేసి విద్యుత్‌సరఫరాను కొనసాగించారు. ఈ వర్షం వల్ల టమోటా పంటకు నష్టం కలగగా, వరిపంటకు మేలు చేకూరింది.

## కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



రామసముద్రం సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

విద్యార్థులు ఉన్నతమైన చదువులు చదివి తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తేవాలని సీఐ సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలో మంచి ప్రవర్తన అలవరుచుకోవడం ద్వారా మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. జీవితంలో క్రమశిక్షణ విజయానికి పునాది అని, దాన్ని నిరక్ష్యం చేస్తే లక్ష్యాలను చేరుకోవడం కష్టమవుతుందన్నారు. ముఖ్యంగా ఒక విషయం చెప్పాలి విద్యార్థులు ఫోన్ జోలికి వెళ్ళకండి. ఫోన్ వల్ల చాలా సమస్యలు వస్తున్నాయని మొబైల్ గేమ్స్ వల్ల జీవితాలు నాశనం అవుతున్నాయని. మొబైల్ గేమ్ వల్ల ఎందరో ప్రాణాలు పోయాయన్నారు. ఈ మధ్యకాలంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నదని ట్రాఫిక్ సమస్యలు, నియమాలను పాటించడం ద్వారా మనం మాత్రమే కాకుండా ఇతరుల ప్రాణాలను కూడా కాపాడువచ్చునన్నారు. గ్రామాల్లో వెళ్లి ప్రతి విద్యార్థి ప్రజలకు హెల్మెట్ ధరించండి ప్రాణాలను రక్షించుకోవాలని తెలియజేయండన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ, సత్యనారాయణ, ఎస్సై రమేష్ బాబు,హెచ్ ఎం చిట్టిబాబు, ఉపాధ్యాయులు మంజునాథ్, పోలీస్ శ్రీనివాసులు,సాఫ్ట్ వేర్ కుమార్, నారాయణ స్వామి విద్యార్థులు పాల్గొన్నారు.

## చెత్త సేకరణ కార్యక్రమం

నిమ్మనపల్లి సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



నిమ్మనపల్లి మండలం నందలి బండ్లపై, బండ్లపై కస్పాలు నందు తవలం పంచాయతీకి సంబంధించిన నల్లపువారిపల్లి నందు నల్లం వారి పల్లి నందు మరియు నిమ్మనపల్లి బస్టాండ్ నందు చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించడం జరిగినది మరియు కొత్తగా ఎంపిక చేసిన సిఆర్పిలను 1000 గృహములకు ఒకరిని నియమించడం జరిగింది. వారిని ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి ఎనిమిది గంటల వరకు చెత్తను దగ్గరుండి తొలగించేటట్టు చేయాలని అందరిని ఆదేశించడం అయినది మరియు కార్యదర్శులు అందరికీ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి గ్రామాలలో ఎక్కడ అంటు వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలని ఆదేశించడం జరిగింది.

## ఎయిడ్స్‌పట్ల అవగాహన కలిగి ఉండాలి




కళాశాల విద్యార్థులతో ర్యాలీ చేపట్టిన కోర్ సంస్థ సిబ్బంది

కే వి పల్లి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:

హెచ్‌ఐవి, ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శ్రీ మేధా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. లోకేష్ బాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నిర్మూలన మరియు నియంత్రణ మండలి, అన్నమయ్య జిల్లా అధికారి డాక్టర్ రమేష్ బాబు సూచనలు అనుసరించి ఇంటెన్సిఫైడ్ ఐఈసి క్యాంపెయిన్లో భాగంగా మంగళవారం పీలేరు శ్రీమేధ జూనియర్ కళాశాలలో, ప్రిన్సిపాల్ ఎస్. లోకేష్ బాబు సహకారంతో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎయిడ్స్‌పై సమాచారాన్ని అందించేందుకు, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నాకో (ఎన్ఏసిఓ) నేతృత్వంలో రాష్ట్రస్థాయిలో 8 వారాల పాటు "మీకు తెలుసా" కార్యక్రమాన్ని చేపట్టారు. క్యాంపెయిన్లో భాగంగా కోర సంస్థ ఉద్యోగి శైలజ మాట్లాడుతూ హెచ్‌ఐవిపై తయారు చేసిన 8 రకాల అంశాలపై ఎనిమిది వారాల పాటు అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందని అన్నారు. ఎయిడ్స్, సుఖ వ్యాధుల పట్ల అవగాహనతో ఎక్కువ మంది హెచ్‌ఐవి రక్త పరీక్షలు చేసుకునేందుకు ముందుకు రావడం జరుగుతోందని తెలియజేశారు. హెచ్‌ఐవి బాధితుల పట్ల ఉన్న చిన్న చూపు, వివక్షను హెచ్‌ఐవి, ఎయిడ్స్ ఆక్ట్ 2017, టోల్ ఫ్రీ నెంబర్ 1097 మొదలైన వాటిపై అవగాహన కల్పించడం ద్వారా వారి వివక్షను తగ్గించి, వారి జీవిత కాలాన్ని పొడిగించవచ్చని తెలిపారు. అందరూ రక్త పరీక్షలు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీమేధ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, కోర్ ప్రతినిధి యస్. హసీన, శైలజ, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## రంగసముద్రం చెరువులో సర్వే


పోరుమామిళ్ళ రూరల్, సెప్టెంబర్ 16ప్రభాతవార్త:



పోరుమామిళ్ల మండలం రంగసముద్రం చెరువులో ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులపై బద్వేలు రెవెన్యూ డివిజన్ సర్వేయర్ రఘురామయ్య నేతృత్వంలో మంగళవారం సర్వేచేశారు. గతంలో పోరుమామిళ్ళ మండల సర్వేయర్ రంగాసముద్రం చెరువును పూర్తిస్థాయిలో సర్వే చేసి హద్దులు చూపారు. దీంతోనీటి సంఘం ఛైర్మెన్ చెరుకూరి వీర చెంద్రాయుడు చెరువు చుట్టు ఆక్రమణలు తొలగించేందుకు ట్రెంచింగ్ కొట్టిస్తుండగా చెరువులో మం డల సర్వేయర్ చేసిన సర్వేలో పలు అనుమానాలు ఉన్నాయం టూ మరొకసారి పూర్తిస్థాయిలో సర్వే చేయించి హద్దులు చూపే వరకు పనులు చేయొద్దని రంగ సముద్రం గ్రామానికి చెందిన ఇండ్లరామిరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, పుల్లారెడ్డి,సుబ్బారెడ్డి,వెంకటరెడ్డి మరి కొందరు సోమవారం జరిగిన బద్వేలు ఆర్డీఓకార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఈ పిర్యాదు మేరకు సర్వేచేయగా మండల సర్వేయర్ చూపిన హద్దులు సరిపోయాయి. త్వరలో పనులు ప్రారంభం చేస్తున్నట్లు ఛైర్మెన్ చెరుకూరి వీర చెంద్రాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుగంగ నీటిపారుదల శాఖ ఇంజనీరు సుజని,మండల సర్వేయర్ సందీప్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## మైనార్టీల హామీలను నెరవేర్చాలి

కడప కార్పొరేషన్ సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:



గత ఎన్నికల్లో మైనారిటీలకు ఇచ్చిన హామీలని నెరవేర్చాలని వైసిపి రాష్ట్ర మైనారిటీ సెల్ అధికారిక ప్రతినిధి షేక్ గౌస్ బాషా (చాక్లెట్) కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం కడప మైనారిటీ సెల్ కార్యాలయంలో కార్పొరేటర్ షంషేర్, వైకాపా నాయకులు అలీ అక్బర్ లతో కలిసి గౌస్ బాషా (చాక్లెట్) విలేకరులతో మాట్లాడుతూ ముస్లింలకు 50 ఏళ్ళకే పెన్షన్, పట్టణాల్లో ఈద్గాలకు, ఖబరిస్తాన్లకు స్థలాలు, విజయవాడలో హజ్ హౌస్ నిర్మాణం చేపట్టాలన్నారు. నూర్బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఏటా రూ.100 కోట్లు కేటాయింపు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందించాలి. ఇమామ్, మోజన్లకు ప్రతినెలా రూ.10 వేలు, రూ.5 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. మసీదుల నిర్వహణకు ప్రతి నెలా రూ.5 వేలు ఆర్థిక సాయం హజ్ యాత్రకు వెళ్లే ఒక్కో ముస్లింకు రూ. 1 లక్ష సాయం చేయాలని కోరారు. అలాగే క్రిష్టియన్ మిషనరీస్ ప్రాపర్టీస్ డెవలప్మెంట్ బోర్డు ఏర్పాటు చేసి, చర్చిల నిర్మాణం, పునరుద్ధరణకు ఆర్థిక సాయం తో పాటుగా స్మశాన వాటికలకు స్థల కేటాయింపు చేయాలని కోరారు.

# స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ సద్వినియోగం చేసుకుందాం



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**వాల్మీకిపురం సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:**
సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వ తేదీ వరకు స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్యమహిళ శక్తివంతమైన కుటుంబ కార్యక్రమం) సద్వినియోగం చేసుకుందామని చింతపర్తి పీ.హెచ్.సి. వైద్యులు జులేఖ బేగం అన్నారు. చింతపర్తి పీహెచ్‌సిలో ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎమ్, ఎమ్ఎల్‌హెచ్‌పీలకు ఎస్ఎన్ఎస్‌పీ. కార్యక్రమం పై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ జులేఖ బేగం మాట్లాడుతూ మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా సెప్టెంబర్ 17 వ తేదీ నుండి అక్టోబర్ 2, రెండవ తేదీ వరకు రెండు వారాలపాటు ," స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ " "(ఆరోగ్యవంతమైన మహిళశక్తివంతమైన కుటుంబం)అను సమగ్ర ఆరోగ్య ప్రచార మరియు సేవా కార్యక్రమము నిర్వహించి వలసిందిగా ఆదేశాలు జారీ చేయడం జరిగింది, ఈ ఈ కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబం బలపరిచే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేయడమైనది, ఈ కార్యక్రమం యొక్క ముఖ్య లక్ష్యాలు, మహిళ ఆరోగ్యం పై అవగాహన పెంచడం, మహిళలకు సమయానుకూల వైద్య సేవలు అందించడం, పోషక ఆహారాన్ని ప్రోత్సహించడం, కుటుంబాలను స్వశక్తి, చేయడం అనగా తమ జీవనోపాధికి శక్తివంతంగా, పని చేసి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవడానికి అందుకు దోహదం పడటం మహిళల ఆరోగ్యం బలపడితే కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుంది. తల్లి ఆరోగ్యంగా ఉంటే తన పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారు, మహిళా శక్తి సమాజ శక్తి కి పునాది అవుతుంది, తల్లి ఆరోగ్యం పిల్లలకు బలమైన భవిష్యత్తు .స్రీ శక్తి కుటుంబానికి సంతోషం.ఆరోగ్య అవగాహనసమాజాభివృద్ధి. కార్యక్రమానికి సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఈ క్రింది కార్యక్రమాలు చేపట్టబోతుంది, పీ. హెచ్. సి. పరిధిలో 7 ప్రదేశాలలో, సెప్టెంబర్, 17, నుండి అక్టోబర్ 2, రెండవ తేదీ వరకు ప్రతిరోజు ప్రత్యేక వైద్య శిబిరాలు వైద్య నిపుణులు మరియు పారా మెడికల్ సిబ్బంది ద్వారా నిర్వహించడం జరుగుతుంది. ఈ వైద్య శిబిరాలు నిర్వాహకం సంబంధిత ఆరోగ్య కేంద్ర/ ఆస్పత్రి వైద్యాధికారులు నేతృత్వంలో నిర్వహించ బడుతుంది, అలాగే మొత్తం ఈ కార్యక్రమం, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా ఆస్పత్రుల కోఆర్డినేటర్ మరియు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సమన్వయంతో నిర్వహించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు , అంతేకాకుండా జిల్లా మండల మరియు గ్రామస్థాయిలో వైద్యశాఖ,, మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయితీ రాజ్ శాఖ, మున్సిపల్ శాఖ, డిఆర్‌డిఏ, మొదలగు శాఖల సమన్వయంతో ఈ బృహత్తర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది కావున జిల్లా ప్రజలందరూ " స్వస్థ్ నారి సశక్త్ పరివర్ అభియాన్"( ఆరోగ్యవంతమైన మహిళా శక్తివంతమైన మహిళా కుటుంబం) కార్యక్రమంలో మీకు అందుబాటులో ఉన్న ఆరోగ్య కేంద్రాలలో పాల్గొని అవసరమైన ఆరోగ్య సేవలు పొందాలని ,కోరారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ అరుణ, డిప్యూటీ హెచ్. ఈ. ఓ. మహమ్మద్ రఫీ, పర్యవేక్షకులు బహుద్దీన్, భానుబి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రతను పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం



**బద్వేలు, సెప్టెంబర్ 16,నప్రభాతవార్త**
పరిసరాలను శుభ్రత పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారని జిల్లా మలేరియా అధికారి పీ మనోహరమ్మ అన్నారు. పట్టణంలోని గర్ల్స్ హై స్కూల్ బాలికల హాస్టల్ను మలేరియా అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హై స్కూల్లో జరుగుతున్న మెడికల్ క్యాంపును పరిశీలించారు. బాలికల హాస్టల్ లో ఉన్న వంటగదిని పరిశీలించారు. శుభ్రంగా వంట చేయాలని వంట మనుషులను ఆదేశించడం జరిగింది. హాస్టల్ వార్డెన్ లక్ష్మీదేవిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రక్కన ఉన్న డ్రైనేజీ కాలువలపై మూతలు వేయాలని సెక్రటరీలను ఆదేశించారు. హైస్కూల్లో ఉన్న విద్యార్థులకు పెడుతున్న భోజనాలను పరిశీలించి హెడ్మాస్టర్ వెంకట్రామిరెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత శుభ్రత, హ్యాండ్ వాష్ విద్యార్థులకు వివరించడం జరిగింది. వాతావరణం మార్పుల వలన ప్రతి ఒక్కరూ కాచి వడగట్టిన నీటిని త్రాగాలన్నారు. పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే పాటించాలన్నారు. పూర్తిగా దోమలను నివారించాలన్నారు. దోమతెరలు తప్పనిసరిగా వాడాలన్నారు. జ్వరాలు వస్తే తప్పక ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించుకోవాలన్నారు. జ్వరాలు తగ్గుముఖం పట్టాయి అన్నారు .వైద్య సిబ్బంది ప్రతిరోజూ ఫీవర్, లార్వా సర్వే చేస్తూ, శుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సౌమ్య, సబ్ యూనిట్ అధికారి సుబ్బరాయుడు, టెక్నీషియన్ శివరాంరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు శ్రీరామయ్య, జనార్దన్‌రావు, వెంకటసుబ్బయ్య, ఏఎన్ఎం స్వాతి, ఆశాలు పాల్గొన్నారు.

## నేషనల్ కరాటే ఛాంపియన్షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



**మదనపల్లె క్రైమ్ సెప్టెంబర్ 16 ప్రభాతవార్త.**
కర్నూలులో జరిగిన 12వ నేషనల్ లెవెల్ కరాటే ఛాంపియన్షిప్ లో మదనపల్లి యోధా అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ ఛాంపియషిప్ లో 12 రాష్టాల నుంచి 2000 మంది విధ్యార్థులు పాల్గొన అండర్ 14 క్యాటగిరిలో మదనపల్లె కు చెందిన విద్యార్థులు 3 బంగారు పథకాలు, అండర్ 10 క్యాటగిరిలో ఒక బ్రాంచ్ పథకం సాధించారు. ప్రత్యేక చాటిన విద్యార్థులను స్నాక్స్ అకాడమీ వ్యవస్థాపకులు ఎం ఏ సతీష్, సహస్ర లు అభినందించారు.

## మార్కెట్‌యార్డు వైస్ ఛైర్మెన్‌గా ఆంజినేయులు



**మదనపల్లె, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త :**
మదనపల్లె మార్కెట్‌యార్డు వైస్ ఛైర్మెన్‌గా మాజీ కౌన్సిలర్ రామిశెట్టి ఆంజినేయులను నియామకం చేస్తూ సిఎం కార్యాలయ కార్యదర్శి రాజమౌళి ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకే జనసేన పార్టీకి చెందిన జంగాల శివరామ్‌ను ఛైర్మెన్‌గా నియమించిన విషయం తెలిసిందే. తాజాగా వైస్ ఛైర్మెన్‌ను నియమిస్తూ మార్కెట్ కమిటీ సభ్యులుగా రమణమ్మ, సుబ్రమణ్యంరెడ్డి, ప్రమీళ, నరసింహులు, పులిమహాలక్ష్మి, మున్నానాయక్, రెడ్డిశేఖర్, మణి, వాణి, బొంతల శ్యామలమ్మ, సంధ్యారాణి, గడ్డం లక్ష్మీపతి, అరుణలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మంగళవారం మార్కెట్‌యార్డు వైస్ ఛైర్మెన్‌గా ఆంజినేయులను రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, పలువురు టిడిపి నాయకులు అభినందించారు.

## హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

**గాలివీడు, సెప్టెంబర్ 16(ప్రభాతవార్త):**
ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మంగళవారం గాలివీడు-రాయచోటి ప్రధాన రహదారి గ్యాస్ గోడౌన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించి అర్హత పత్రాలతో పాటు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

**వీరపునాయునిపల్లె,సెప్టెంబర్ 16, ప్రభాత వార్త:**



మండలంలోని వెలుగు కార్యాలయం పిడి డాక్టర్ రాజలక్ష్మి తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ మండలంలో ఎన్‌ఎస్పి యాక్షన్ ప్లాన్ గురించి తెలుసుకున్నారు. అదేవిధంగా గతంలో మాదిరి కాకోకుండా మహిళలు బ్యాంకు ద్వారా రుణాలు తీసుకోవాలంటే ఈ యాక్షన్ ప్లాన్ అనుగుణంగానే వారికి అవసరమైన సమయంలోనే రుణాలు మంజూరు అవుతాయని ఆమె తెలిపారు అదేవిధంగా త్వరలోనే మన డబ్బులు మన లెక్కలు అనే యాప్ ద్వారా డ్వాక్రా సంఘ సభ్యులకు సభ్యులకు ఈ యాప్ పై అవగాహన కల్పించి అందరికీ అందుబాటులో ఉంచుతామని దీని ద్వారా ఎలాంటి వారికైనా తమ సంఘంలో ఎంత డబ్బులు లోను ద్వారా తీసుకున్నాము తాము తిరిగి ఎంత చెల్లించాము ఇంకా ఎంత చెల్లించాలి అనేది వాయిస్ రూపంలో ఉంటుందని ఆయన తెలిపారు ప్రస్తుతానికి ఇది పైలట్ ప్రాజెక్టు కింద కొన్ని వివోలలో అందుబాటులో ఉందని ఈ మండలంలో కూడా అందుబాటులోకి తెస్తామని ఆయన తెలిపారు అదే విధంగా ఎన్పీపీ యాక్షన్ ప్లాన్ లో ఈ మండలానికి సంబంధించి 1026 అగ్రికల్చర్ రుణాలు కావాలని, 528 పాడి పరిశ్రమ కు సంబంధించిన రుణాలు కావాలని అడిగారని అదేవిధంగా మిగతా వాటికి సంబంధించిన రుణాలను కావాలని యాక్షన్ ప్లాన్ రూపొందించారని వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మేరకు సంఘ సభ్యులకు రుణాలను మంజూరు చేస్తామని వాటి ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆయన తెలిపారు అదే విధంగా డ్వాక్రా సంఘాలకు రుణాల మంజూరులో పారదర్శకతను పాటిస్తూ సంఘ సభ్యులు అందరూ కూడా బయోమెట్రిక్ వేయాలని అప్పుడే బ్యాంకు వారు రుణాలను మంజూరు చేస్తారని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఏపీఎం భాగ్యమ్మ సిబ్బంది ఇతరులు పాల్గొన్నారు.

## చెడు అలవాట్లకు బానిస కావొద్దు



**మైదుకూరు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:**
మైదుకూరు పట్టణ బద్వేల్ రోడ్డు శాంతినగర్ లో ఉన్న బి సి మరియు ఎస్సీ హాస్టల్ విద్యార్థులతో మైదుకూరు అర్బన్ సిఐ కె రమణారెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాట్లాడుతూ విద్యార్థులు మంచి భవిష్యత్తు నిర్ణయాలతో చదువులు రాణించాలని ఉన్నత శిఖరాలకు చేరాలని తల్లిదండ్రులకు మంచి పేరుతో పాటు ఉద్యోగాలు సాధించాలని అప్పుడే తల్లిదండ్రులు సంతోషిస్తారని కొనియాడారు. అలా కాకుండా విద్యార్థి దశ నుండి చెడు అలవాట్లకు బానిస కాకూడదని సిగరెట్టు, ఆల్కహాల్, గంజాయి లాంటివి అలవాటు చేసుకోవడం ప్రమాదకరమని మత్తు పదార్థాలు అలవాటు చేసుకుంటే భవిష్యత్తు అంధకారమైతాదని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులు ఎంపిక



**రాజుపాలెం, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కొర్రపాడు, తొండలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నెట్ బాల్, టేబుల్ టెన్నిస్ క్రీడా విభాగాల్లో కొర్రపాడు నుండి 7 మంది విద్యార్థులు, తొండలదిన్నె నుండి 7 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు, లక్ష్మీనారాయణ రెడ్డిలు తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన నెట్ బాల్ పోటీలలో కొర్రపాడు పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్14 విభాగంలో అబినయ్, చంద్రిక, అండర్ 17 విభాగంలో సంతోష్ కుమార్, తేజస్ కుమార్, స్పందన, అండర్ 19 విభాగంలో శ్రీహరి, అఫ్జల్ ఎంపిక కాగా, తొండలదిన్నె పాఠశాలకు చెందిన విద్యార్థులు టేబుల్ టెన్నిస్ జిల్లాస్థాయి క్రీడా పోటీలలో మంచి ప్రతిభ కనబరిచిన అండర్ 14 విభాగంలో సుశాంత్, సుభాష్, ప్రశాంతి, అండర్ 17 విభాగంలో పోలమ్మ, జితేంద్ర ఎంపిక కాగా అండర్ 19 విభాగంలో సుజిత, చరితలు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయులు సుబ్బయ్య, జిలాని భాషలను అధ్యాపక బృందం, గ్రామ ప్రజలు అభినందించారు. టేబుల్ టెన్నిస్ క్రీడలు ప్రోత్సహించి క్రీడా పరికరాలను అందించిన సూర్య కిరణ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయిలో క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో కూడా తమ సత్తాసాటి పాఠశాలకు గ్రామమునకు మండలానికి గుర్తింపు తీసుకురావాలని పలువురు వారి అభిప్రాయాలను వ్యక్త పరిచారు.

## నేడు మండల సర్వసభ్య సాధారణ సమావేశం

**మదనపల్లె, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త :**
మండల సర్వసభ్య సాధారణ సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయం నందు జరుగుతుందని ఎంపిడిఓ తాజ్‌మస్రూన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ప్రజాసమస్యలపై చర్చించి గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడం జరుగుతుందన్నారు. మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

## ఉర్దూ మీడియం ప్రవేశ పెట్టాలి

### ఎమ్మెల్సీకి వినతిపత్రం



వినతిపత్రం అందజేస్తున్న జూనియర్ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం

**పులివెందుల,సెప్టెంబరు 16, ప్రభాత వార్త:**
పులివెందులలోని బాలికల జూనియర్ కళాశాల మరియు మహిళా డిగ్రీ కళాశాలలో ఉర్దూ మీడియాన్నీ ప్రవేశ పెట్టేలా చర్యలు తీసుకోవాలని మంగళవారం పశ్చిమ రాయలసీమ జిల్లాల పట్టభద్రుల శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డికి జూనియర్ మరియు డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, ఆయా విద్యాసంస్థల్లో ఉర్దూ మీడియంను ప్రవేశపెట్టాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు ఆయనతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని విద్యార్థినుల భాషా అవస రాలను దృష్టిలో ఉంచుకొని, ఉర్దూ మీడియంను ప్రారంభించడం వల్ల అనేకమంది విద్యార్థినులు ఉన్నత విద్యను సులభంగా కొనసాగించవచ్చని అధ్యాపకులు వివరించారు.వినతిపత్రాన్ని స్వీకరించిన అనంతరం ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన అనుమతులు లభించేలా కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి బొజ్జా మైసురా రెడ్డి, మహేశ్వర రెడ్డి , కళాశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## యూరియా వాడకాన్ని తగ్గించండి




**దువ్వూరు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:**
రైతులు వరి సాగు చేసే సమయంలో యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలని, దీంతో నాణ్యమైన పంట దిగుబడి లభిస్తుందని మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బాలాయి పల్లె గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ సాగుచేసిన మొక్కజొన్న, జొన్న, ఉల్లి పంటలను పరిశీలించారు. సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతనం ఆయన మాట్లాడుతూ ఎకర వరి సాగుకు కేవలం 90 కేజీలు మాత్రమే యూరియా వాడాలని అది రెండు దఫాలుగా వేసుకోవాలని ఆయన సూచించారు. గతంలో మాదిరి యూరియా సరఫరా లేదని రైతులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. అలాగే యూరియా బదులు పొటాష్, కాంప్లెక్ ఎరువులు వాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని మన గ్రోమోర్ నందు యూరియా పంపిణీ చేస్తామని అవసరమైన రైతులు తమ ఒరిజినల్ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డుతో వచ్చి టోకెన్ తీసుకోవాలని అన్నారు.

## ఆర్కేవ్యాలీలో ఓజన్ డే వేడుకలు

### ఓజన్ పొరను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత



**వేంపల్లె:సెప్టెంబర్ 16:(ప్రభాత వార్త)**
ఆర్జియూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో ప్రపంచ ఓజన్ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ 8,14,1 విభాగాల ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, స్థిరత్వంపై అవగాహన కల్పించారు. అలాగే ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్తా పాల్గొని మాట్లాడారు. భూ వాతావరణం చుట్టూ ఓజన్ పొర రక్షణగా ఏర్పడి సూర్యుని ద్వారా విడుదలయ్యే శక్తివంతమైన కిరణాల నుంచి జీవ ప్రపంచాన్ని రక్షిస్తుందన్నారు. ఓజన్ పొరను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని సూచించారు. పరిపాలనాధికారి రవికుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డా.రమేష్, డా.దీప్తి, అధికారులు సత్యానంద్, తిరుపతిరెడ్డి, అనిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రీ సర్వే డ్రాఫ్ట్ ఆర్వోఆర్‌పై గ్రామసభ



**కలికిరి, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:**
కలికిరి మేజర్ పంచాయతీ రెడ్డివారిపల్లి కలికిరి-4 సచివాలయంలో మంగళవారం తహసీల్దార్ హరికుమార్ ఆధ్వర్యంలో రీ సర్వే డ్రాఫ్ట్ ఆర్వోఆర్‌పై గ్రామసభ నిర్వహించారు. ఇటీవల రెడ్డివారిపల్లి రెవెన్యూ గ్రామంలో రీ సర్వే పూర్తి చేయడం జరిగింది. దానికి సంబంధించి రైతులకు భూముల హద్దుల పైన రీ సర్వేపైన ఎల్పీసీలపై ఏమైనా అనుమానాలుంటే అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించే దిశగా గ్రామసభ నిర్వహించి రైతులతో చర్చించడం జరిగింది. పలువురు రైతులు తమ సమస్యలను తహసీల్దారు దృష్టికి తీసుకురాగా వాటిని తహసీల్దార్ పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి డివిజనల్ అధికారి రవిచంద్ర, డిప్యూటీ తహసీల్దార్ వెంకట రమణారెడ్డి, కలికిరి మండల సర్వేయర్ రెడ్డప్ప, వీఆర్వోలు శిల్పకుమారి, గౌరీ, కలికిరి సర్పంచ్ ఎల్లయ్య, కలికిరి మేజర్ పంచాయతీ అభివృద్ధికమిటీ అధ్యక్షుడు రెడ్డివారి యోగేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన తాత్కాలిక మట్టి రోడ్డు

**సుండుపల్లె, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :**
నీటి ప్రవాహానికి రెడ్డివారి పల్లి రాయవరం మధ్యలో బహుదా నదిపై ఉన్న తాత్కాలిక మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. మంగళవారం పింఛ ప్రాజెక్టు పై భాగంలో మోస్తారు వర్షాలు పడి ప్రాజెక్టులోకి వరదనీరు రావడంతో నదిలోకి నీటి నీ విడుదల చేశారు. నీటి ప్రవాహానికి పింఛా బహుద నది పై ఉన్న మట్టి రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రతి ఏడాది నీటి ప్రవాహానికి మట్టి రోడ్డు కొట్టుకుపోవడం స్థానికులు ఇబ్బందులకు గురికావడం జరుగుతుంది. వంతెన ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



## ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలి



**బ్రహ్మం గారి మఠం సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే పథకాలను ప్రజలకు చేర్చే బాధ్యత అధికారులు కీలక పాత్ర పోషించాలని మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల అధ్యక్షుడు వీరనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ అధికారులు క్రమశిక్షణతో ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడి ఆ శాఖలో ఉన్న పెండింగ్ పనులను త్వరితగతిగా పూర్తి చేయాలని శాఖ అధికారులకు ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన అధికారుల పనితీరు పట్ల ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేసి విధి నిర్వహణ సక్రమంగా చేయని పక్షంలో శాఖపరమైన చర్యలను తీసుకోవడానికి వెనుకాడనని అధికారులను హెచ్చరించారు. మండలంలో ఎరువుల కొరత అధికంగా ఉందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే విషయాన్ని ఉన్నతాధికారులతో మాట్లాడి బ్రహ్మంగారిమఠం మండలానికి ఎరువుల కొరత లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలను జారీ చేశారు అలాగే భూ సమస్యల పైన రెవెన్యూ అధికారులను సమన్వయపరిచి మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు అలాగే అక్రమంగా భూములను ఆన్లైన్ చేయించుకున్న వారి నుండి భూములను సేకరించి ఆ భూములను మండలంలో ఎవరైతే భూమిలేని పేదలు ఉన్నారు వారికి ఆ భూములు ఇచ్చేందుకు తాను కృషి చేస్తున్నానని అది తన చిరకాల ఆకాంక్షని ప్రతి పేదవాడు మా కూటమి ప్రభుత్వంలో ఉన్నతంగా ఉండాలని తమ ఆలోచనని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేషనల్ హైవే సమస్యలు పరిష్కరించిన ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి,శశి భూషణ్ రెడ్డి



**పులివెందుల,సెప్టెంబరు 16 , ప్రభాత వార్త:**
బెంగళూరు అమరావతి ఎక్స్రెస్ వే లో వేముల మండలం రైతులు రహదారి విషయమై ఎదుర్కొంటున్న సమస్యలను పశ్చిమ రాయల సీమ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగో పాల్ రెడ్డి రాష్ట్ర భాజపా అధికార ప్రతినిధి వంగల శశి భూషణ్ రెడ్డిలు పరిష్కరించా రు. నేషనల్ హైవే నిర్మాణ పనుల్లో భాగంగా ఎర్రిపల్లి , చింతల జూటూరు గ్రామాల మధ్యన కడుతున్న బ్రిడ్జి వలన స్థానికి రైతులు పంట రాబడి తీసుకెళ్ళడానికి తలెత్తే సమస్యల కారణంగా గ్రామ రైతులు బ్రిడ్జి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. గ్రామాల మధ్య కట్టే బ్రిడ్జి 4.715 మీటర్ల ఎత్తు కట్టడంతో ఇబ్బందులు ఎదురవుతాయి అని నేషనల్ అథారిటీ అధికారులకు ప్రాజెక్ట్ డైరెక్టర్ కి కలెక్టర్ కు కాంట్రాక్టర్ కంపెనీ అధికారులుకు పలు మార్లు గ్రామస్థులు పిర్యాదు చేశారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ స్వయంగా వచ్చి చర్చలు జరిపిన పలితం లభించలేదు. దీనితో గ్రామస్థులు తదుపరి నిర్మాణ పనులు చేపట్టకుండా అడ్డుకున్నారు. దీంతో మంగళవారం భాజపాధికార ప్రతినిధి వంగల శశి భూషణ్ రెడ్డి , శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిలో గ్రామ ప్రజలతో కలిసి నిర్మాణ సంస్థల ప్రతినిధులతోను నేషనల్ హైవే అథారిటీ అధికారులతో కలిసి నిర్మాణ పనులను పరిశీలించి సమస్యకు పరిష్కార చర్యలు చేపట్టారు.చర్చలు అనంతరం బ్రిడ్జి ఎత్తును 4.715 మీటర్ల నుంచి 5.3 మీటర్ల వరకు పెంచి నిర్మాణాలు చేసేందుకు అధికారులు మరియు నిర్మాణ సంస్థ అధికారులు ఒప్పు కోవడంతోపాటు బ్రిడ్జి కింద వర్షం నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకుంటా మని అధికారులు హామీ ఇవ్వడంతో సమస్య పరిష్కారమైంది. సమస్య పరిష్కారానికి కృషిచేసిన శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి రాష్ట్ర భాజపా అధికార ప్రతినిధి శశిభూషణ్ రెడ్డి లకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే అధికారులు రామ్ కుమార్, సురేష్ , నిర్మాణ సంస్థ డిపిఎల్ కంపెనీ అధికారి భాను ప్రకాష్ , బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్ర మోహన్ రెడ్డి, పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి బొజ్జా మైసూరారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, బాలగంగారెడ్డి తదితర నాయకులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం

**సిద్ధవటం సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**



ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 16న అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం జరుపుకుంటారు. భూమిపై జీవరాశిని, హానికరమైన అల్ట్రా వైలెట్ కిరణాల నుండి రక్షించే ఓజోన్ పొర మనకు అతి ముఖ్యమైన రక్షణ కవచం. కానీ పారిశ్రామిక ఉత్పత్తులు, వాహనాల ఉద్గారాలు, ముఖ్యంగా క్లోరో ఫ్లోరో కార్బన్లు (దినీద్బి ),హలోన్స్ వంటి రసాయనాలు వాడకం వల్ల ఓజోన్ పొర నశిస్తోంది. దీనివల్ల చర్మ క్యాన్సర్, కంటి వ్యాధులు, పంటల దిగుబడి తగ్గడం, వాతావరణ మార్పుల వంటి సమస్యలు తలెత్తుతున్నాయని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాషా తెలిపారు. ఓజోన్ పొరను కాపాడుకోవడానికి పర్యావరణ హిత పరికరాలను వాడటం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, చెట్లు నాటడం, రీసైక్లింగ్ అలవాటు చేసుకోవడం అవసరమన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం అంటే భవిష్యత్ తరాలను కాపాడుకోవడమే ఈ అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం సందర్భంగా మనమందరము పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, ఈ దిశగా పాలకులు కూడా కృషి చేయాలని సమీర్ బాష కోరారు.

## 21మంది బైండోవర్

**రామసముద్రం సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**
రామసముద్రం మండల కేంద్రంలోని గాజులు నగరం చెందిన 21 మంది ని మంగళవారం తాహిసీల్దార్ మహ్మద్ అజారుద్దీన్ ముందు బైండోవర్ చేయించినట్లు ఎస్సై రమేష్ బాబు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ సోమవారం ఇరువర్గాలు బహిరంగ ప్రదేశంలో గొడవలు పాల్పడినందుకు కేసులు అయిన వారిని పోలీస్ స్టేషన్ కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చామని మరో సారి అలా చేయకుండా బైండోవర్ చేసామన్నారు.

